# బదిలీ

**-సత్యవాడ సోదరీమణులు**

వెచ్చని సూర్యకిరణాలు ముఖం మీద పడుతూ వుంటే మెలకువ వచ్చింది సునీతకి. శరీరం హాయిగా, మనస్సు ప్రశాంతంగా వుంది. నిన్నమొన్నటి దాకా ప్రతిరాత్రి నిద్రలేమితో కళ్ళు బరువుగా వుండేవి. పగలంతా ఏ పని చేయాలన్నా బద్ధకం ఆవరించేది. ఆలోచిస్తూనే ముఖం కడుక్కుంది. ''కాఫీ తీసుకో వదినా....''

''అరే నీవెందుకు చేసావమ్మా'' ఆడపడుచు చేతుల్లోంచి కాఫీ గ్లాసు సుతారంగా తీసుకుంది.

''కాఫీ మాత్రమేనా? సౌజన్య టిఫిన్ కూడా తయారుచేసింది'' అనంత్ ప్లేట్లలో ఉప్మా సర్దుతూ అన్నాడు.

''అవునొదినా! నేను కాలేజీకి వెళ్ళిపోతే బాబు నిన్ను ఏ పని చేయనిస్తాడు!? ఇంకా వంట కూడా చేసేద్దామనే అనుకున్నా. మరీ చల్లారిపోతుందని...''

''పోనీలేమ్మా! చేసింది చాలు. నిన్ను నీ మేనల్లుడు రాత్రంతా నిద్రపోనిచ్చాడు కనుకనా! వాడితో నువ్వు కూడా కాసేపు విశ్రాంతిగా పడుకోవాల్సింది. ఉద్యోగ బాధ్యతలు ఎలాగూ తప్పవు. ఇంటి పనంతా మరీ నెత్తిన వేసుకుంటున్నావు''

''దాందేముంది వదినా ఇందులో నాకెంతో తృప్తి వుంది.'' సౌజన్య మాటలను, వారించలేకపోయింది.

''నిజమే తృప్తిలేనిదే ఎవరూ ఏ పనీ చేయరు. బాబు పుట్టిందగ్గరి నుంచి వాడితో తను ఎంత సతమతమవుతున్నా పుట్టింట్లో పట్టించుకున్న దెవరు? తెల్లారి లేస్తే ఇంటెడు చాకిరీ చేయాలి. నీ కొడుకు ఏడవగానే పాలిచ్చి నిద్రపుచ్చు. రాత్రంతా వీడి నస నీకు ఓ పట్టాన మెలకువరాదు. చంటిపిల్లాణ్ణి సాకడం భయమంటావు. పాతికేళ్ళు పైబడ్డా నువ్వేదో పసిదానిలా'' వదినెలిద్దరి సాధింపులు. చెల్లెలూ అంతే ఓసారి ముద్దువచ్చి ఎత్తుకున్నా కాసేపు ఆడించవే అంటే ''అబ్బాబోర్ అక్కా.. మేం టీవీ చూసుకోవాలి. అసలింత తొందరగా ఎందుకు కనేసావే! ఇప్పుడు చూడు వీడి అల్లరితో నిన్నే కాక మా అందరినీ ఎంతవేపుకు తినేస్తున్నాడో!'' అంటుంటే తనకి బాధ అనిపించేది.

''పెద్ద ఆరిందాలా మాట్లాడకు ఆ మాత్రం నాకూ తెలుసు. ఇంకెంత మూడోనెల వచ్చిందంటే వుంచమన్నా వుంచడు మీ బావగారు'' అని అనేది.

నిజానికి అయిదోనెల వచ్చేవరకూ తను పుట్టింట్లోనే వుంటానన్నా అభ్యంతరం చెప్పని సంస్కారం తన భర్తది. ''బాబూ కాస్త పెరిగేదాకా నీవు మీ ఇంట్లోనే వున్నా ఇబ్బంది లేదు షునీ! మా కోసం ఆలోచించకు. నీకు సుఖంగా వుంటుందంటే మీ ఇంట్లోనే గడిపిరా!'' బారసాలకి వచ్చినప్పుడు భర్త అన్న మాటలివి. కాని పుట్టింటి వాతావరణం బాబుకి మూడోనెల వచ్చిన రెండు రోజులు కూడా అక్కడ వుండనివ్వలేదు. ఇక్కడికి వచ్చాక తను ఎంత సుఖపడుతోంది. సౌజన్య సుతిమెత్తని లాలనలో పెరుగుతున్నాడు వాడు. బాబు బాధ్యత ఆడపడుచు సగం పైన వేసుకోవడంతో మాతృత్వపు మాధుర్యం ఇప్పుడు తెలుస్తుంది తనకు.

''ఇదిగో వదినా మా మేనల్లుడు ఉయ్యాల్లో వున్నాడు. కలల్లో తేలి కాసేపు లేవనే లేవడు. ఈలోగా నీవు పనులు తెమిల్చేసుకొని వాడి ముద్దులు తీర్చడానికి రడీగా వుండాలి. వాణ్ణి ఏడిపించావంటే నేనూరుకోను సుమా! కాలేజీ నుంచి రాగానే నీ పనిచెప్తా వెళ్ళొస్తాను'' బ్యాగ్ చేతిలోకి తీసుకొని చకాచకా సాగిపోయింది.

తనే తల్లయినట్టు చెప్పుకుపోతున్న ఆ ఆడపడుచును చూస్తుంటే సునీత కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. బాబంటే ఎంత ఆపేక్ష సౌజన్యకి. తనపట్ల కూడా ఎనలేని అభిమానం. అన్నయ్యంటే ఆ పిల్లకు దేవుడే. నిజానికి సౌజన్య మమతలకు ఆకృతి.

''ఛీ!...ఈ అమ్మాయి గురించా! తను ఆరోజుల్లో అలా అనుకున్నది!''

సునీత మనోఫలకం మీద గతం నిలిచింది. తనకి అనంత్‌తో పెళ్ళిచూపులు జరిగి ఆ సంబంధం అన్నయ్యలకు, నాన్నకు అన్ని విధాలా నచ్చింది. తనకూ నచ్చకపోలేదు. నిజానికి అనంత్‌ని ఏ ఆడపిల్లైనా చూసిన మరుక్షణం మనసు పారేసుకుంటుంది. అతని కళ్ళల్లో ఆకర్షణ, రూపంలో హుందాతనం, ముఖవర్చస్సు తననూ ఆ పరిస్థితుల్లోనే పడేశాయి. అయితే సమస్య ఒక్కటే. అది తనను పెనుభూతంలా ఆవరించింది. వదినలూ ఆ సమస్యను కొండంతగానే ఊహించారు. అందుకనే తను ససేమిరా అనంత్‌ని చేసుకోను అనేసింది. ఆ రూపాన్ని తన మనస్సులోంచి చెరిపే ప్రయత్నం చేసింది.

పెద్దన్నయ్య ''చూడు సునీతా అర్థంలేని ఆలోచనలతో కలిసి వచ్చిన సంబంధాన్ని కాలదన్నుకోకు. ఇంతకీ ఇదేమంత పెద్ద విషయం, సౌజన్య మీతోపాటు వుంటే......మీకొచ్చిపడే కష్టాలేమిటి?'' ఇలా గంటల తరబడి క్లాస్ తీసుకొన్నాడు.

చిన్నన్నమాత్రం తక్కువ తిన్నాడా! ''నువ్వు ఏ యుగంలో వున్నావు. పిచ్చి పిచ్చి ఊహలతో గోరంతను కొండంతలుగా చేస్తున్నావు. ఈ సంబంధం వదులుకుంటే బ్రతుకంతా పశ్చాత్తాప పడతావు. మంచి ఉద్యోగం, కాస్తంత ఆస్థిపాస్తులున్న ఇలాంటి సంబంధం దొరకాలంటే ఎన్ని పాట్లు పడాలి'' చీవాట్లు వేసాడు.

తనకి వొళ్ళు మండిపోయింది. ''ఇంతోటి గొప్ప సంబంధం తీసుకొచ్చారులే. ఉద్యోగస్థుడైతే సరిపోతుందా? ఆస్తిపాస్తులుంటే అయిపోతుందా! బ్రతుకంతా మోయవలసిన బాధ్యత తగలడిందిగా! ఆ కష్టంతో ఏసుఖాలు సాటిరావు. నన్ను మీరెవ్వరూ బలవంతం చెయ్యనక్కరలేదు. నా అభిప్రాయాలు నావి'' సుమారు అన్నలిద్దరితో పోట్లాడిందనే చెప్పాలి.

వదినలిద్దరి మాట తనతో ఒకటయ్యింది. ''అవునండీ..కోరి కోరి ఇలాంటి సంబంధం తెచ్చారేమిటి? చెప్పినవాడికి చాదస్తం అయితే, విన్నవాడికి వివేకం లేదు అన్నట్లు ఇంకా ఆ అమ్మాయితో వాదులాడుతున్నారే. ఏ ఆడపిల్లయినా అత్తపోరు ఆడబిడ్డపోరు లేని కాపురాన్నే కోరుకుంటుంది. గుది బండలా తయారై గుమ్మం దాటని ఆడబిడ్డ పోరు జీవితాంతం మన సునీత ఎలా భరిస్తుంది?'' అంది పెద్దవొదిన.

చిన్న వొదిన ఊరుకోలేదు. ''ఆవిడకి సేవలు చేస్తూ ఇంటిని అంటిపెట్టుకుండాలి తప్ప, సినిమాలు, షికార్లు, ముద్దు, ముచ్చట ఏం జరుగుతాయి తనకు. ఆడపడుచుల్ని పెళ్లి చేసి పంపించామంటే అదో ఆనందం. ఎప్పటికీ కలిసి బ్రతకాలంటే చూస్తూ చూస్తూ ఏ అమ్మాయీ అంగీకరించదు. ఊరికే సునీతని వేధించకండి. తనిష్టమే కానిచ్చి, మరే సంబంధమైనా వెతకండి'' ఖచ్చితంగా చెప్పింది.

ఆయింట్లో ఆడాళ్ళ మాటంతా ఒకటి, మగాళ్ళ మాట వేరొకటి అయ్యింది. తండ్రి అయితే కూతురి భావాలకు కృంగిపోయాడు. ''ఎంత అసంస్కారంగా తయారయ్యింది

సునీత! పైగా మొండివైఖరి ఒకటి. తను మెత్తగా వుంటే లాభం లేదు. ఎలాగైనా ఈ పెళ్ళి జరిగి తీరాలి.'' అతనిలో పట్టుదల అంకురించింది. ''ఏమిటి మీరంతా? ఊసుపోని మంగలి పిల్లి బుర్ర గొరిగినట్టు లేనిపోని రగడలు లేవదీస్తున్నారు. అంధురాలైన ఆడపడుచు ఉన్నంతమాత్రాన ఆ ఇంటి కోడలికి వాటిల్లే నష్టమేమిటి? అయినా ఆ అమ్మాయికేం నోట్లో ముద్దలు పెట్టక్కర్లేదు. అహోరాత్రులు చాకిరి చేయక్కర్లేదు. నేను సౌజన్యని చూసాను. నిజానికి సునీత కంటే తనే చురుకుగా వుంది. చకాచకా పనులు చేసుకుంటూ ఇంటిని చక్కదిద్దుకొంటుంది. ఆడదిక్కు లేని ఆ ఇంట్లో దీపంలా వెలిగే ఆ అమ్మాయి గురించా మీ తర్జన భర్జనలు. లెక్చరర్‌గా పాఠాలు చెప్పటమే కాదు. జీవితం సజావుగా సాగేందుకు అవసరమైన పాఠాలు నేర్పగలిగే సంస్కారవంతురాలు సౌజన్య. మూర్ఖత్వంతో మీరు ఇలా ఆలోచిస్తున్నారే తప్ప ఈ పెళ్ళి జరిగితే సునీతకి ముంచుకువచ్చే ముప్పేం లేదు. నేను రిటైరయ్యేలోగా దాని పెళ్ళి జరిగి తీరాలనుకున్నాను. ఇది కాదనుకుంటే సునీతకు పెళ్లి చూపులే జరగవు''




అంటూ కుండబద్దలుకొట్టినట్లు తన నిర్ణయం చెప్పేశాడు.

''ఎందుకో నాన్నగారికి ఇంత పంతం. అంతా తన కర్మ. పోనీ నాన్నారి ఇష్టమే కానిచ్చి.. భర్తను కొంగున కట్టుకొని ఆడపడుచు పీడ వదిలించుకోగలదేమో'' అనుకున్న తను తలవంచేసింది. అనంత్‌పైన ప్రేమతో, ఆడపడుచు అంటే అక్కసుతో ఆ యింట్లో అడుగుపెట్టింది. తన అంచనా తారుమారయింది. తను అత్తవారింటిలో అడుగుపెట్టిన మరుక్షణం నించి సౌజన్య కురిపించే అనురాగం, పంచే ఆత్మీయత తనను ఉక్కిరిబిక్కిరి చేసాయి. అన్నింటా చేదోడు, వాదోడు అయి మొలుగుతున్న సౌజన్య తనను ఎంతగా ఆకట్టుకుంది!! ఇంటి పని సగానికిపైగా తనే చేస్తుంది. ''అన్నయ్యా, నువ్వూ అలా వెళ్ళిరండి వదినా, బొత్తిగా సాయంకాలం ఇంట్లోనే ఏంతోస్తుంది. మా మేనల్లుడో, మేనకోడలో నేనున్నానని అంటూ పుట్టుకొచ్చారంటే మీ సరదాలు తీరినట్టే'' అంటూ ఆ జంటని ఎటో, అటు బయలుదేరదీసేది.

ఈ రెండేళ్ళలోనే సౌజన్య తనలో ఎన్నో తీయని జ్ఞాపకాలు పండించింది. నిజానికి తను ప్రణయ మాధుర్యాన్ని రుచి చూసిందన్నా, అనంత్‌కి ప్రాణంలో ప్రాణం అయిపోయిందన్నా అన్నిటికీ కారకురాలు తన ఆడపడుచే.

ఆరోజు తన పెళ్ళిరోజు. అనంత్ చేత ఆఫీసుకు సెలవు పెట్టించింది. దేవాలయానికి మనం ముగ్గురం కలిసి వెళ్దాం. ఇక మిగిలిన రోజంతా ఎప్పటికీ మరపురాని

విధంగా మీరు గడపాలి'' పెద్ద ఆరిందాలా చెబుతూ తనకో పట్టుచీర బహుమతిగా ఇచ్చింది. ఎవరి ఆడపడుచులైనా అన్నావదినల అన్యోన్యతకు రవ్వంత అసూయ పడటం సహజం. కొందరైతే ఈర్ష్యతో కళ్ళల్లో నిప్పులు పోసుకుంటారు. కాని తను లోకాన్ని చూడలేకపోతున్నా, తన జీవితంలో ఏ ఆశలు పెంచుకోక పోయినా, అన్నావదినల అనురాగమే తన ఆనందంగా పరవశించే కళ్ళులేని తన ఆడపడుచు; గర్వంతో అహంకారంతో మూసుకుపోయిన తన కళ్ళు తెరిపించింది.




ఆరోజు తనకనిపించింది తను ఊహించుకున్నదంతా సౌజన్యముందుంచి క్షమాపణ వేడాలని. సాహసించి ఆ పని చేయలేకపోయింది.

''ఏమమ్మా కొత్తపెళ్ళికూతురా! ఈరోజు నీకు మళ్ళీ శోభనం, వచ్చే ఏటికి నాకు మేనల్లుణ్ణి ఇవ్వకపోయావో నీపని చెబుతా'' అంటూ తనను దగ్గరికి తీసుకొని బుగ్గచిక్కి ముద్దుపెట్టుకొంది.

''ఏమిటీ అల్లరి సౌజన్యా! అప్పటికి నువ్వేదో ముసలమ్మవైనట్టు దీవెనలొకటా. నాకు సిగ్గుగా వుంది బాబూ'' తనలోని అణువణువూ పులకించిపోతూ ఆడపడుచు భుజంపై తలవాల్చింది.

తను నెల తప్పిందగ్గరి నించి ఎంత అపురూపంగా చూసింది. రోజొక పండుగలా మురిపించేసింది. కాస్త తడుముకోవలసి వచ్చినా పనంతా తనే చేస్తూ ఆడపడుచుగా ఇది నా విధి. కాదు కూడదు అన్నావో నేను అర్థము గుణ్ణే అంటూ తను ఏ చిన్న పనిని చేయబోయినా మందలించి మరీ వారించేది.

తను పురిటికి పుట్టింటికి వెళ్ళినా క్షణ క్షణం సౌజన్య గుర్తుకు వచ్చేది. మగని పైన మమత కంటే అర్థముగుడిపైన అనురాగమే తను ఇంత తొందరగా అత్తింటికి వచ్చేట్టు చేసింది. సునీత మనసంతా ఆడపడచే నిండిపోయింది.

బాబు పాకుతూ ఇల్లంతా తిరుగుతుంటే సౌజన్య మరింత ముచ్చట పడిపోయింది. ''పారాడే పనసపండు, కూర్చుండే గుమ్మడిపండు'' అంటూ మేనల్లుడిపై అప్పటికప్పుడు పాటలల్లి పాడేది.

''చూడు సునీ! మన సౌజన్యకి వీడేలోకమైనట్లుంది'' చెల్లెలి మురిపెం చూస్తూ సంబరపడిపోతున్నాడు అనంత్.

''నాకూ అలాగే అనిపిస్తుందండీ; ఒక్క కాలేజీకి వెళ్ళేటప్పుడు తప్ప బాబుని ఎప్పుడూ విడిచి వుండటం లేదు సౌజన్య. వీళ్ళ అనుబంధానికి ముచ్చట వేస్తోంది'', అన్నా వదినల ధోరణికి నవ్వొచ్చింది సౌజన్యకి.

బాబుని ఎత్తుకొని వీధి వాకిట్లో నిలబడి రెపరెపలాడే మనస్సుతో వచ్చేపోయే వాహనాలను చూస్తుంది.

ఎనిమిది గంటలు దాటినా ఈ పిల్ల ఇంకా రాలేదేంటి కొంపదీసి ఏ ప్రమాదమైనా జరిగితే.. అమ్మో! ఆ తలపే భరించలేని సునీత గట్టిగా కళ్ళు మూసుకుంది. తను అనుకున్న ప్రమాదమైతే జరగలేదు. కాని సునీతకి మరో రకమైన షాక్ తగిలింది. ఆ షాక్ నుంచి తేరుకోలేకపోతోంది. అదే సౌజన్య సునీత చేతుల్లో ఉంచిన ట్రాన్స్‌ఫర్ ఆర్డర్.

''నువ్వు రాలేదని ఎంత కంగారు పడ్డానో'' అనబోతున్న వదిన చేతుల్లో తన ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ పెట్టి ''నీ అనుమతి ఆశీర్వాదం కావాలి వదినా! కొత్త జీవితం ప్రారంభించబోతున్నా'' అనేసరికి నిశ్చేష్టురాలైంది.

''అదేంటి సునీ అలా అయిపోయావు జరగరానిది ఏదీ జరగలేదిప్పుడు'' భర్త మాటకు రవ్వంత తెప్పరిల్లి అంది.

''నాకైతే అలాగే వుందండీ.''

''సౌజన్య వెళ్ళిపోతుందంటే ఏమౌతుందట'' ఎగతాళిగా అన్నాడు అనంత్.

''ఏ మౌతుందంటే ఏం చెప్పగలను..నిత్యం రవళించే మమతల వీణకు తీగ తెగిపోతుందండీ. అసలు సౌజన్య మనతో కలిసి ఉండదు అన్న తలపే భరించలేకపోతున్నాను. ఇక ఆ పిల్ల వేరే వూరు వెళ్ళిపోతే''...సునీత గొంతు గద్గదికంగా పలికింది. కళ్ళలో నీరు సుడులు తిరిగింది.

''అరే ఆశ్చర్యంగా వుందే! సౌజన్యకు బదిలీ అయితే ఇంతగా తల్లడిల్లిపోతున్నావు'' అనంత్ స్వరంలో కరకుతనం.

''సౌజన్య మనకు పరాయిదా.. అన్నయ్య అలా అనటం లేదు వదినా! ఎప్పటికీ మీకు భారంగా వుండి బతుకు ఈడవకూడదు అన్నదే నా తలపు. నా అభిప్రాయానికి విలువనిచ్చిన అన్నయ్య నామాట కాదనలేదు. ఫలితమే ఈ బదిలీ.''


''నిజమే..సునీతా వాళ్ళు తమలోపాన్ని అధిగమనించి ఆత్మవిశ్వాసంతో జీవించాలి అనుకుంటారే తప్ప, తన వాళ్ళపైన ఆధారపడి మనుగడ సాగించాలని కోరుకోరు. మన పెళ్ళి చూపులు జరిగిన మరుక్షణం నించి నువ్వు పడ్డ బాధ మాకు తెలుసు. తనకీ ఉద్యోగం వుందని తన బ్రతుకు తను బ్రతకగలదనీ తెలిసినా గ్రుడ్డి ఆడపడచుతో సహజీవనం చేయాలని మా సంబంధాన్నే తిరస్కరించావు. విషయం తెలుసుకొని నా బంగారుచెల్లి ఎంతగా కుమిలికుమిలి ఏడ్చిందో నీ ఊహకి అందదు.''

''ఈ సమాజం ఇంతేలే అన్నయ్యా! మేము ఎంత ప్రగతి సాధించినా అన్నివిధాలా మా జీవనపథం చక్కబరుచుకున్నా మా లోపాల్ని గుర్తుచేస్తూనే వుంటుంది. నాకు తోడబుట్టినందుకు నీకూ ఇలాంటి అనుభవాలు తప్పవు. మా ఉనికిని అసహ్యించుకుని మాతో బంధుత్వం పెంచుకోవటానికి మనస్సు ఒప్పని వారెందరో. ఈ మోస్తరు స్వభావాలు మారినప్పుడు మాత్రమే మాకు పూర్తి శాంతి కలుగుతుంది. సంతృప్తిగా జీవించగలుగుతాం. ఎలా అయినా నువ్వు సునీతని చేసుకో..ఆమె తత్వాన్ని నేను మారుస్తాను'' అని ఛాలెంజ్ చేసింది.

''నువ్వు ఇప్పుడిలా ఆవేదన పడుతుంటే సౌజన్య గెలిచిందేమో అనిపిస్తుంది''

''అవునండీ! గెలుపు సౌజన్యదే. నా అహంకారం, మూర్ఖత్వం పూర్తిగా నన్ను ఓడించాయి. మీరిద్దరూ నన్ను మన్నించాలి''

''ఎంత మాట వదినా! నేను ఎక్కడ వున్నా నీ అర్థముగుణ్ణే కాకుండా పోతానా...ఛ..ఛ.. నీ మూడ్ మార్చు, నవ్వుతూ నన్ను సాగనంపాలి మరి'' వదిన చేతులు తన చేతుల్లోకి తీసుకుంటూ అంది సౌజన్య. ★



## దటీజ్ రజనీ!

రజనీకాంత్ తాజా తమిళ చిత్రం 'పడయప్పా' ప్రారంభం నుంచీ వార్తల్లో వుంటూనే వుంది. ఇది తెలుగులో 'నర్సింహ' పేరిట అనువాదం అవుతోంది. ఏప్రిల్ 14న రిలీజ్ కానున్న ఈ సినిమా ఎప్పుడు చూద్దామా అని జనం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రేజీని దృష్టిలో పెట్టుకునే కాబోలు ఓ సబ్బుల కంపెనీ వారు తమ ప్రొడక్ట్‌ని (ఫలానా ఇన్ని సబ్బులు కొంటే) కొంటే లక్కీ డిప్‌లో ఫలానా విలువైన బహుమతులు, అలాగే లక్కీ విన్నర్స్‌కి 'పడయప్పా' సినిమా టిక్కెట్‌లు అని వెరైటీ స్కీమ్‌లని ప్రవేశపెడుతోందిట. దీనికి జనం నుంచి రెస్పాన్స్ కూడా విపరీతంగా వుందిట. ఆల్రెడీ ఆడియో కాసెట్‌ల హక్కుల అమ్మకాల్లోనూ, కాసెట్ల అమ్మకాల్లోనూ సరికొత్త రికార్డుల్ని సృష్టించిన 'పడయప్పా' ఇప్పుడు రిలీజ్ కాబోతోందనగా ఇలాంటి స్కీమ్‌లతో కూడా మరో సంచలనాన్ని సృష్టిస్తోంది. అంతా బానే వుంది. కానీ ఈ సినిమా ఎంత వరకూ జనాన్ని ఆకట్టుకుంటుందో వేచి చూడాల్సిందే!

– జె.ఎం.